నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 3 డిసెంబర్ 2024 | SURYAPET

టీఎస్ మోడల్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ అన్నపూర్ణ, బీఆర్ఎస్‌వీ నాయకులు

గురుకులాలను భ్రష్టు పట్టిస్తున్న ప్రభుత్వం

బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో గురుకులాల సందర్శన

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 2 : గురుకుల విద్యా సంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులు కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి శిగ వెంకటేశ్ అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్‌వీ పిలుపులో భాగంగా సోమవారం పట్టణం లోని పలు గురుకుల పాఠశాలలను, హాస్టళ్లు, మోడల్ స్కూల్‌ను బీఆర్ఎస్‌వీ రాష్ట్ర బృందంతో కలిసి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. బీఆర్ఎస్ హయాంలో గత ముఖ్యమంత్రి కేసీఆర్ వందలాది గురుకులాలు ఏర్పాటు చేసి పేద పిల్లలకు నాణ్యమైన విద్యను చేరువ చేస్తే నేడు రేవంత్ సర్కారు భ్రష్టు పట్టిస్తుందని తెలిపారు. విద్యార్థులకు సరైన ఆహారం కూడా అందించలేకపోతున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ జిల్లా కో ఆర్డినేటర్ ముదిరెడ్డి అనిల్‌రెడ్డి, నాయకులు నవీన్‌కుమార్, నెమ్మాది శ్రావణ్‌కుమార్, బానోతు సురేశ్, గుండాల సందీప్, పల్లెపంగు నాగరాజు, రమావత్ అశోక్, వాడపల్లి సందీప్, వేల్పుకొండ రామకృష్ణ పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

ఇథనాల్ కంపెనీని ఎత్తివేయాలి

- ప్రజారోగ్యాన్ని ఫణంగా పెట్టి కార్పొరేట్లకు కొమ్ముగాస్తున్న మోడీ సర్కారు
- సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ

మోతె, డిసెంబర్ 2 : ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా, దుష్పరిణామాలను వివరించకుండా మండలంలోని రావిపాడు గ్రామంలో ఇథనాల్ కంపెనీని ఏర్పాటుచేస్తుండడం దుర్మార్గమని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్ కుమార్ మండిపడ్డారు. పరిశ్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎస్ఎంకె కంపెనీని వద్ద స్థానికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఇథనాల్ కంపెనీ వెదజల్లే వ్యర్థాలు, విషవాయువుతో జనం అనారోగ్యం బారిన పడుతారని ఎం.డేవిడ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పక్కన పెట్టి కార్పొరేట్లకు కొమ్ము గాస్తున్నదని విమర్శించారు. ఆహార ధాన్యాల ద్వారా ఇథనాల్ ఉత్పత్తి చేసే విధానాన్ని మానుకొని ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని డిమాండ్ చేశారు. ఇథనాల్ ఉత్పత్తికి ప్రధానంగా నీరు అవసరమని, అందుకు పాలేరు జలాలను వాడడం వల్ల సాగు, తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళనలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగా నాగయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యాక్షుడు కునుకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, జిల్లా సహాయ కార్యదర్శి అలుగుబెల్లి వెంకటరెడ్డి, అరుణోదయ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎర్ర ఉమేష్, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నరసమ్మ, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ గ్రామ కార్యదర్శి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బ్యాడ్మింటన్ టీమ్ కోచ్‌గా రామకృష్ణ

తెలంగాణ రాష్ట్ర బ్యాడ్మింటన్ టీం కోచ్‌గా ఎంపికైన రామకృష్ణ

మిర్యాలగూడ, డిసెంబర్ 2: ఈ నెల 4 నుంచి 7వ రకు ముంబైలోని థానే జరుగనున్న బాలబాలికల యునెక్స్ సన్‌రైజ్ మూడో మినీ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2024కి అండర్-11 తెలంగాణ జట్టు కోచ్‌గా మిర్యాలగూడ పట్టణానికి చెందిన మారబోయిన రామకృష్ణ ఎంపికైనట్లు బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.ప్రశాంత్, పి.నవీన్ తెలిపారు. సోమవారం మీడియాతో వారు మాట్లాడుతూ గతంలో రామకృష్ణ అండర్-13 రాష్ట్ర కోచ్‌గా పలు విజయాలను తెలంగాణకు అందించినట్లు పేర్కొన్నారు. కోచ్ రామకృష్ణ మాట్లాడుతూ అవకాశాన్ని ఇచ్చిన బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ పుల్లెంల గోపిచంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మిగిలిన రుణమాఫీకి ఎగనామమేనా?

నాలుగో విడుతలో మరికొందరికి..

నల్లగొండ జిల్లాలో మరో 40వేల మంది ఎదురుచూపులు

- రుణమాఫీ పూర్తయ్యిదన్న సీఎం రేవంత్‌రెడ్డి
- అధికారుల సర్వేలోనే 60వేల మంది గుర్తింపు
- మరోసారి బ్యాంకుల చుట్టూ రైతుల చక్కర్లు
- రైతుల ప్రశ్నలకు సమాధానం చెప్పేవారే కరువు
- ప్రభుత్వ తీరుపై రైతుల ఆగ్రహం

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్2(నమస్తే తెలంగాణ) : ఇప్పటికే వానకాలం రైతు భరోసాకు ఎగనామం పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇక మిగిలిన వారి రుణమాఫీని అటకెక్కించేందుకూ సిద్ధమైంది. రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన తాజా ప్రకటనే అందుకు నిదర్శనం. రాష్ట్రంలో రైతులకు 100 శాతం రుణమాఫీ పూర్తి చేశామని సీఎం చేసిన ప్రకటన రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది. మూడు విడతల్లో కలిపి ఉమ్మడి జిల్లాలో 3.39 లక్షల మందికే రుణమాఫీ జరగ్గా నాలుగో విడతలో మరికొంత మంది వివరాలు ప్రకటించారు. ఒక్క నల్లగొండ జిల్లాలోనే ప్రభుత్వం నిర్వహించిన అధికారిక సర్వే ప్రకారమే ఇంకో 40వేల మంది రైతులు రుణమాఫీ కోసం అర్హులైన వారు ఉన్నారు. వారి సంగతి ఏంటన్నది సీఎం ప్రకటనతో గందరగోళంలో పడింది. ఆది నుంచి ఎంత వీలైతే అంతగా రైతుల సంఖ్య తగ్గించేలా ప్రభుత్వం చేస్తున్న కుట్రలు అందరికీ తెలిసిందే. ఇంకా కూడా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కనీసం రెండు లక్షల మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నట్లు రైతు సంఘాల నాయకులు అంచనా వేస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ జూలైలో రుణమాఫీని అమలు చేస్తున్నట్లు ప్రకటించిన నాటి నుంచి నిత్యం పొలాల్లో ఉండాల్సిన రైతులు అంతకుమించిన సమయాన్ని బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరిగడానికే వెచ్చించాల్సి వచ్చింది. అందుకు కారణం ప్రహసనంగా మారిన రుణమాఫీ ప్రక్రియనే. ప్రభుత్వం ప్రకటించిన మూడు విడతల రుణమాఫీలో ఉమ్మడి జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 60 శాతానికి మించలేదు. మిగతా 40శాతానికి పైగా రైతులు రుణమాఫీ కోసం గత ఆగస్టు 15 నుంచి ఎదురుచూస్తూనే ఉన్నారు. అన్ని అర్హతలున్నా రుణమాఫీ కాకపోవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మూడు నెలల నుంచి అదిగో... ఇదిగో రుణమాఫీ అంటూ ఊరిస్తూ వచ్చిన ప్రభుత్వం గత నెల 30న మరికొంత మందితో నాలుగో విడత(చివరి విడతనే భావిస్తున్నారు) జాబితాలను ప్రకటించింది. ఇందులోనూ రుణమాఫీని కొద్దిమందికే పరిమితం చేశారు. గత మూడు నెలలుగా వ్యవసాయ శాఖ చేసిన సర్వేలోని వివరాల ప్రకారం రైతులను కూడా పరిగణిలోకి తీసుకోలేదు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడు విడతల రుణమాఫీలో కలిపి 3.39లక్షల మంది రైతులకే రుణమాఫీ జరిగింది. జిల్లాలో కనీసం ఆరు లక్షల మంది రైతులు రుణమాఫీకి అర్హులు ఉంటారని అప్పట్లోనే రైతు సంఘాల నేతలు అంచనా వేశారు. కనీసం ఇంకో 2లక్షల నుంచి రెండున్నర లక్షల మంది రైతులు రుణమాఫీ కావాల్సిన వారు ఉంటారని పేర్కొన్నారు. రేషన్ కార్డు లేని వాళ్లు, ఒక కుటుంబంలో ఉన్న వ్యక్తులకు రెండు లక్షలకు మించి రుణం ఉన్నవాళ్లు, ఆధార్, బ్యాంకు అకౌంట్, పట్టాదారు పాస్‌పుస్తకం నెంబర్లతోపాటు పేర్లు సరిపోలకపోవడం కారణాలతో వీరిని ప్రభుత్వం పక్కన పెట్టింది. ఎన్నికల హామీల్లో పంట రుణాలు తీసుకున్న రైతుల్లోని ప్రతీ ఒక్కరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. తీరా అమలులోకి వచ్చే సరికి లబ్ధిదారుల సంఖ్యను కుదించేందుకు వీలైనన్ని సాకులను ముందుకు తెచ్చారు. దాంతో రుణమాఫీని అమలు చేస్తున్న తీరుపై రైతులు రోడ్లెక్కి ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. రైతుల ఆగ్రహాన్ని చల్లార్చడానికి ప్రభుత్వం పలు ఎత్తుగడలు వేసింది. రేషన్ కార్డు లేని రైతుల సర్వే ఓ వైపు తప్పులను సరిదిద్దే కార్యక్రమాన్ని మరోవైపు కొద్దికాలం చేపట్టింది. కానీ దీనికి కూడా నిర్దిష్టమైన గడువు ఏదీ పెట్టకుండా కాలయాపన చేసింది. మూడున్నర నెలలుగా ఈ ప్రహసనం కొనసాగుతూనే వచ్చింది.

రేషన్ కార్డు సర్వే పేరుతో...

నిజానికి రుణమాఫీ కాకపోవడానికి 31 కారణాలు ఉన్నాయని స్వయంగా రాష్ట్ర వ్యవసాయ శాఖనే గుర్తించి ప్రభుత్వానికి పంపింది. కానీ ఈ కారణాలున్న రైతుల అందరి వివరాలు సేకరించకుండా కేవలం రేషన్ కార్డు లేని వారి వివరాలు సేకరించారు. ప్రస్తుతం నాలుగో విడతలో రేషన్ కార్డు లేని వారిలో 2 లక్షల వరకు రుణాలు ఉన్న మరికొంత మందికి రుణమాఫీ జరిగినట్లుగా చేసినట్లు వ్యవసాయశాఖ చెప్తున్నది. సర్వే చేసే అప్పుడే 31 కారణాలతో మాఫీ కాని రైతుల వివరాలు సేకరించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. నల్లగొండ జిల్లానే పరిశీలిస్తే వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం 44వేల మంది రైతులు రైతులు రేషన్‌కార్డు లేక రుణమాఫీకి దూరమైనట్లు తేలింది. ఇందులో ప్రస్తుతం కేవలం 21వేల మంది రైతులకు మాత్రమే తాజాగా నాలుగో విడతలో మాఫీ జరిగినట్లు తెలిసింది. మిగిలిన 23వేల మందితోపాటు ఆధార్, బ్యాంకు, పట్టాదారు పాసుపుస్తకం, లోన్ అకౌంట్ నంబర్లలో తప్పులు లేదా పేర్లు సరిపోలకపోవడం వంటి కారణాలతో మరో 16వేల మందికి రుణమాఫీ కావాల్సిన వారూ ఉన్నారు. అధికారికంగానే సుమారు 40వేల మంది ఒక్క నల్లగొండ జిల్లాలో రుణమాఫీ జరగలేదన్నది స్పష్టం. ఇక అనధికార లెక్కల ప్రకారం ఈ సంఖ్య కనీసం మరో 50వేల మంది ఉంటారని రైతు సంఘాల నేతలు చెప్తున్నారు.

బ్యాంకుల చుట్టూ మళ్లీ రైతులు

తాజాగా నాలుగో విడతలో మరికొందరి పేర్లతో జాబితా విడుదల అవడంతో ఇప్పటి వరకు రుణమాఫీ కాని రైతులంతా మళ్లీ బ్యాంకులకు పరుగులు పెడుతున్నారు. ఆదివారం వ్యవసాయశాఖ జాబితా విడుదల చేస్తూ లబ్ధిదారుల పేర్లను బ్యాంకులకు పంపింది. దాంతో రైతులంతా సోమవారం వ్యవసాయ శాఖ అధికారులతో పాటు బ్యాంకులకు క్యూ కట్టారు. తమ పేర్లు ఈ జాబితాలోనైనా వచ్చాయా, లేదా? తమకు రుణమాఫీ జరిగిందా, లేదా అన్న విషయాలు తెలుసుకునేందుకు బారులు దీరారు. జాబితాలో పేర్లు లేని వారూ మరోసారి నిట్టూరుస్తూ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రేషన్ కార్డు లేని వారురూ. 2లక్షల వరకు రుణం ఉన్న వారినే ఈ సారి పరిగణలోకి తీసుకోవడంతో మిగిలిన కారణాలతో మాఫీ కాని వారు మండిపడుతున్నారు. తమకు ఎప్పుడు రుణమాఫీ అవుతుందని బ్యాంకర్లను, అధికారులను నిలదీస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం రేవంత్‌రెడ్డి 100 శాతం రుణమాఫీ పూర్తయిందని ప్రకటించడంతో రైతుల్లో మరింత ఆగ్రహం పెల్లుబిక్కుతున్నది.

రేషన్ పంపిణీకి బియ్యం లేవ్..

వెలవెలబోతున్న గోదాములు... గత నెల కంటే దుర్భర పరిస్థితి

- 4,705 మెట్రిక్ టన్నులకు గాను 830 మెట్రిక్ టన్నులే సరఫరా
- గత పదేండ్లలో ఇలాంటి పరిస్థితి లేదంటున్న డీలర్లు
- అయ్యా... బాబూ అంటూ మిల్లుల చుట్టూ అధికారుల చక్కర్లు
- ఈ నెల పంపిణీ ఎప్పుడు షురూ అయ్యేనో?

పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యానికి సూర్యాపేట జిల్లాలో కరువు ఏర్పడింది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ డీలర్లకు సరఫరా చేయాల్సిన గడువు ముగిసినా జిల్లాలోని గోదాములు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కనీసం 10 శాతం లక్ష్యం కూడా చేరుకోలేదు. ప్రతి నెల 20 నుంచి నెలాఖరు నాటికి 610 రేషన్ షాపులకు 4,705 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా.. ఈ నెల గడవు దాటి మూడు రోజులైనా కేవలం 117 షాపులకు 830 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే సరఫరా చేశారు. గత నెలలో కూడా ఇదే పరిస్థితి ఉండగా, ప్రస్తుతం పౌర సరఫరాల అధికారులు మిల్లర్ల చుట్టూ తిరుగుతూ అయ్యా... బాబూ బియ్యం పంపండి అంటూ బతిమిలాడుకుంటున్నారు.

– సూర్యాపేట, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ)

ఖాళీగా దర్శనమిస్తున్న బియ్యం గోదాం

త్వరలోనే రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తామంటూ ఇటీవల మంత్రులు గొప్పలకు పోగా.. వాస్తవానికి దొడ్డు బియ్యానికే దిక్కు లేని పరిస్థితి. జిల్లాలో ఫుడ్ సెక్యూరిటీ, అంత్యోదయ, అన్నపూర్ణ తదితర కార్డులు కలిపి 3,24,188 ఉండగా, నెల నెలా ఆయా రేషన్ షాపుల్లో ఉండే పాత స్టాక్‌ను బట్టి 4,800 నుంచి 5,900 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ జరుగుతుంది. డిసెంబర్ నెలకు సంబంధించి 4,705 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉంది. కానీ, జిల్లాలోని ఎఫ్‌సీఐ, ఎస్‌డబ్ల్యూసీ గోదాములు ఖాళీగా కనిపిస్తున్నాయి. గడువు ముగిసినా నేటికీ పది శాతం కూడా సరఫరా కాలేదు. గత బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని రేషన్ డీలర్లు చెబుతున్నారు. ప్రస్తుతం రెండు, మూడు నెలల నుంచి గోదాములు ఖాళీగానే కనిపిస్తున్నాయి. సాధారణంగా ప్రతి నెల 23 నుంచి నెలాఖరు వరకు గోదాముల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లు, అక్కడి నుంచి రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేస్తారు. ప్రతి నెల ఒకటో నుంచి 15 వరకు డీలర్లు రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తారు. డీలర్ల వద్ద ఉండే ఈ-పాస్ మిషన్లు కూడా 15వ తేదీ సాయంత్రం ఆన్‌లైన్ ఆఫ్ అవుతాయి. అలాంటిది గత నెల 15 వరకు కూడా డీలర్లకు బియ్యం సరఫరా కావడంతో నెలాఖరు వరకు ఈ పాస్ మిషన్ సేవలను అందుబాటులోకి ఉంచి పంపిణీ చేశారు.

ప్రభుత్వ అసమర్థత... ముందు చూపు లేకనే..

కాంగ్రెస్ సర్కారు అసమర్థత, ముందుచూపు లేమితోనే గోదాములు ఖాళీ అయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొనుగోలు కేంద్రాల నుంచి పెద్దఎత్తున ధాన్యం కొనుగోలు చేసి సీఎంఆర్ కోసం మిల్లులకు ఇచ్చి సరైన సమయంలో బియ్యం తీసుకోగా ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో రేషన్ బియ్యం సేకరణ కష్టంగా మారింది. బియ్యం రేషన్ షాపులకు వస్తున్న కార్డుదారులు డీలర్లు బియ్యం ఇంకా రాలేదని చెప్తుండడంతో వెనుదిరుగుతున్నారు. పౌర సరఫరాలు, రెవెన్యూ అధికారులకు జిల్లాలోని మిల్లులకు తిరుగుతూ బియ్యం సరఫరా చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం నిధులు లేకపోగా నిధులు వచ్చిన వెంటనే డబ్బులు ఇస్తామని బతిమాలడడం, కొన్ని సందర్భాల్లో బెదిరింపులకు దిగడం చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వారం నుంచి మిల్లుల చుట్టూ తిరిగి కేవలం 825 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే సేకరించగా, సోమవారం మరో ఐదు మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 830 మెట్రిక్ టన్నుల బియ్యం తీసుకువచ్చినట్లు సమాచారం. ఈ పరిస్థితి ఇంకా ఎన్ని నెలలు ఉంటుందో, ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొవాలోనని డీలర్లు విసుగెత్తిపోతున్నారు.

ఉద్యమాలతో ప్రజా చైతన్యం

- ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోడీ సర్కారు
- సీపీఎం జిల్లా మహాసభల్లో పాలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

మిర్యాలగూడలో ర్యాలీ తీస్తున్న బీవీ రాఘవులు, జూలకంటి, చెరుపల్లి తదితరులు

మిర్యాలగూడ, డిసెంబర్ 2 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఉద్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని సీపీఎం పోలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు అన్నారు. ప్రధాన మంత్రి మోడీ అవలంబిస్తున్న విధానాల వల్ల దేశంలో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సీపీఎం నల్లగొండ జిల్లా 21వ మహాసభల సందర్భంగా మిర్యాలగూడలో సోమవారం మహా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎన్నెస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మోడీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతూ ప్రజలపై ధరల భారాన్ని మోపుతున్నదన్నారు. హామీ అమలు కోసం రైతులు మరోమారు ఢిల్లీ బాట పట్టేందుకు సిద్ధమయ్యారన్నారు. రాష్ట్రాలకు హక్కులు లేకుండా మోడీ కొత్త చట్టాలు తీసుకొస్తున్నారని, తద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపాలిటీలుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక విధానం ద్వారా స్థానిక సంస్థలు నిర్వీర్యం, ప్రాంతీయ పార్టీలు కనుమరుగు అవుతాయని పేర్కొన్నారు. దాంతో దేశంలో లౌకికవాదం, సామ్యవాదం, ఫెడరలిజం ఖూనీ అవుతుందన్నారు. ఎర్రజెండాకు పూర్వ వైభవం తేవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేశ్, సయ్యద్‌హుషం, కందాల ప్రమీల, ప్రభావతి, నాగార్జున, కూన్‌రెడ్డి నాగిరెడ్డి, బండా శ్రీశైలం, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల్లో సస్యరక్షణ

గులాబీ మొక్కలపై రైతులకు వివరిస్తున్న పూల పరిశోధనా విభాగం హెడ్ డాక్టర్ గద్దె జ్యోతి

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 02 : ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఫెంగల్ తుఫాను, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఉద్యాన పంటల్లో తగు జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని పూలు, కూరగాయల విభాగం శాస్త్రవేత్తలు సూచించారు. కూరగాయల విభాగం హెడ్ డాక్టర్ అనిత, పూల పరిశోధనా విభాగం హెడ్ డాక్టర్ గద్దె జ్యోతి ఈ కింది సూచనలు చేశారు.

బంతి : రబీలో నాటిన పంటకు 30 రోజులకు తలను తుంచి వేయాలి. ఆకు తినే పురుగుల నివారణకు క్లోరోఫైరీపాస్ 2 మిల్లీలీటర్లను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

గులాబీ : కొమ్మ కత్తిరింపులు చేపట్టాలి. ఆకులు తినే మిడతల నివారణకు వేప కషాయం 5 మిల్లీలీటర్లను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొగాకు లద్దె పురుగు నివారణకు స్పైనోసాడ్ 0.3 మిలీలీటర్లను లీటర్ నీటిలో కలిపి స్ప్రే చేయాలి. బూడిద తెగుళ్ల నివారణకు హెక్సాకొనజోల్ 2మి.లీ. లేదా, నీటిలో కరిగే గంధకం 2.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పూలను ఉదయం, సాయంత్రం మాత్రమే తెంచాలి.

చామంతి : ప్రస్తుతం చామంతి పూత దశలో ఉంది. అధికంగా ఉన్న పక్క కొమ్మలను, మొగ్గలను తుంచేయాలి. పక్కన వచ్చిన పిలకలను తీసివేయాలి. బూడిద తెగుళ్లు కనిపిస్తే నీటిలో కరిగే గంధకం 2.5 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పువ్వు కుళ్లు నివారణకు కార్బండైజిమ్ గ్రాముని లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మల్లె : మొక్కల్లో కొమ్మ కత్తిరింపులు, ఆకులు రాల్పి కొమ్మలను దగ్గరగా కట్టాలి. మొక్కలకు నీటి తడులు, ఎరువులను నెల వరకు వేయకకూడదు. కొత్త ఇగుళ్లు ప్రారంభమైన తర్వాత నీటి తడులు ఇవ్వాలి. ఆకుమచ్చ, బూడిద, బూజుతెగుళ్ల నివారణకు కార్బండైజియం, మాంకోజెబ్ 2.5 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కాయతొలుచు పురుగు నివారణకు : నొవాల్యూరాన్ 0.75 మిల్లీలీటర్లను లీటర్ నీటిని కలిపి పిచికారీ చేయాలి. బ్యాక్టీరియా, ఆకు మచ్చ తెగుళ్లు, కొనోఫోరా, ఎండు తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్0. 3గ్రాములు, ప్లాంటమైసిన్ గ్రాము కలిపి తగు మోతాదు నీటితో కలిపి పిచికారీ చేయాలి. కాయ కుళ్లు, పక్షి కన్ను తెగుళ్ల నివారణకు ప్రొఫికొనైజోల్ 1 మిల్లీలీటర్‌ను లీటర్ నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

కూరగాయలు : టమాట, వంకాయ, ఉల్లి, బెండ, తీగజాతి కూరగాయల పొలాల్లో నిలిచిన నీటిని తీసివేయాలి. మొక్కలకు మట్టిని ఎగదొయ్యాలి. నిటారుగా పెరిగే మొక్కలకు వూతమివ్వాలి. పది రోజుల వ్యవధిలో రెండు సార్లు యూరియా ద్రావణం పిచికారీ చేయాలి. చనిపోయిన మొక్కలను తీసివేసి ఆ ప్రదేశంలో మళ్లీ విత్తడం లేదా నాటడడం చేపట్టాలి. కలుపు నివారణకు అంతర కృషి చర్యలు తీసుకోవాలి. 19.19.19 తగు మోతాదు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మిరపకు 10గ్రాముల యూరియా , చక్కెర, లీటర్ నీటిని కలిపి పిచికారీ చేయాలి. మొక్కలు ఎక్కువ కాలం నీటిలో మునిగినట్లైతే మెగ్నీషియం సల్ఫేట్ 5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ఇనుము ధాతు లోపం కనిపించినట్లయితే 50 గ్రాముల అన్నబేది, 10గ్రాముల నిమ్మ ఉప్పు 10లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలి.